# శాస్త్రి గారి శాస్త్రం

మహాదేవశాస్త్రి గారంటే జంటనగరాల్లో పేరున్న పురోహితుడు! అయన మాటంటే అందరికీ వేదవాక్కే! అన్ని సర్కిల్స్‌లోనూ పలుకుబడి కలిగిన వ్యక్తి!

ఉపనయనం ఎనిమిదోఏట కాగానే... వేదపాఠశాలలో చేరి విద్యాభ్యాసం పూర్తి చేసుకుని వుద్యోగం కోసం పొట్ట చేతబట్టుకుని హైదరాబాద్ చేరుకున్నాడు.

అప్పట్లో రాష్ట్ర రాజధానిలో పౌరోహిత్యానికి గాని... వేద పాండిత్యానికి గాని పెద్దగా డిమాండ్ వుండేది కానందువల్ల... సంపాదన ఆశించినస్థాయిలో లేనందుకు మనిషి డీలాపడ్డాడు మహాదేవశాస్త్రి.

పినతండ్రిగారింట్లో ఎన్నాళ్లని ఫ్రీగా తింటూ వుండటమాని బాధపడ్డాడు.

ఎలాగైతేనేం. సిటీలో వలసలు వచ్చే వారిసంఖ్య పెరుగుతూ రావటం మూలాన... పౌరోహిత్యానికి ప్రాముఖ్యత కన్పిస్తూ వచ్చింది.

వేద పాండిత్యం ఎందుకూ కొరగాకుండా పోవటం... పండితుడిగా పేరు ప్రతిష్ఠలు ఆర్జించగల అవకాశం మృగ్యమైనందువల్లనూ... శాస్త్రిగారి దృష్టి పౌరోహిత్యం మీదకు మళ్ళింది. ఇందులోనైనా నాలుగు డబ్బులు సంపాదించలేకపోతానా అనే ఆశ అంకురించింది.

మొత్తానికి మహాదేవశాస్త్రిని ఆ దేవుడు కరుణించాడు!

కాలం గడిచేకొద్దీ... ఇటు డిమేండ్... అటు ఆదాయం పెరగటం మొదలైంది. చేతికింద నలుగురిని పెట్టుకోగలస్థాయికి ఎదిగేడు. చిక్కడపల్లిలాంటి సెంటర్లో చౌకరోజుల్లో కొనిపెట్టిన నాలుగొందల గజాల స్థలంలో మొత్తానికి రెండు అంతస్తులమేడకి ఓనరైనాడు.

పెళ్ళానికి గొల్సు... ఇంట్లో ఫోను... తనకో టూవీలరు!

ఏ శుభకార్యం జరిపించాలన్నా... రాజకీయ నాయకులు... వ్యాపారస్తులు... అఫీషియల్సు... మహదేవశాస్త్రినే పిలిపించుకుని తంతు జరిపించుకోవటానికి పట్టుబట్టేవారు. శాస్త్రిగారి చేయి అచ్చొచ్చేదని అందరి అభిప్రాయం.

సిటీకొచ్చాక... ఆదాయం... అంతస్తూ పెరిగేక మహాదేవశాస్త్రిలో చాలా మార్పొచ్చింది! అయితే మొదట్లో తన అలవాట్లను బహిర్గతం కానిచ్చేవాడుకాదు. అంతా గుంభనంగా... రహస్యంగా తన్లోనే దాచుకునేవాడు.

నాగరికత బలసిన కారణంగ శాస్త్రిలోనూ అనూహ్యమైన మార్పు చేసుకోనారంభించింది!

నుదుటున వీభూది పట్టెలు... నెత్తిన పిలక... మెడలో గొల్సు చైను... రెండుజతల రుద్రాక్ష మాలలు... చేతికి బంగారు కంకణం... చెవులకు పోగులు... ఎర్రటి శరీరఛాయ... మనిషి

గంభీరంగ... సుందరంగ అవుపిస్తాడు.

టూవీలర్ పార్క్‌చేసి ఇరానీ హోటల్లో దూరి ఎవరైనా చూస్తారేమోని భుజాన ఉత్తరీయం ముఖానికి అడ్డు తెరగా పెట్టుకుని లోనికి దూరేడు శాస్త్రి.

ఆ ఇరానీ హోటలు ఎప్పుడూ జనంతో రద్దీగా వున్నా... కూర్చునేటందుకు లోనికి రాగానే ఖాళీగా సీటు కన్పించకపోయినా... కష్టమర్లు నిలబడే వేడి వేడి చికెన్ బిర్యానీ లాగించి... నోట్లో టూత్‌పిక్ పెట్టుకుని బిల్లు చెల్లించి వెడుతూండడమనేది అక్కడ రోజూ కన్పించే దృశ్యం!

ఒక చేతిలో సెల్... మరోచేతిన లాప్‌టాప్ వుండటాన నిలబడి కార్యక్రమం చేపట్టటానికి వీలుకాక... ఖాళీ కాబోయే సీటు కోసం నిరీక్షించటం తప్పనిసరైంది.

తింటూ... వేళ్ళు చీక్కుంటూ... చేయి నాక్కుంటూ గంటల తరబడి పక్కవారితో ముచ్చట్లు చెప్పేవారేగానీ ఏ ఒక్కరూ త్వరగా తినటం ముగించి బైటపడదామనే ఆలోచనలో వున్నట్టు కన్పించలేదు శాస్త్రికి!

తద్దినం రోజు గారెలన్నా... చికెన్ బిర్యానీ అన్నా భలే ఇష్టం శాస్త్రికి! ఒకప్పుడు ఓ అరకప్పు కాఫీతో నరిపెట్టుకుని పుణ్యకార్యాలుగానీ... శ్రాద్ధకర్మలగానీ చేయించటంవల్ల పుణ్యమొస్తుందనుకుని కాలే కడుపుతో కార్యక్రమాలను పూర్తిచేసిగాని భోజనం చేసేవారుకాదు.

ఇప్పుడు ఆ పద్ధతులు మారినయ్! పాత అలవాట్లు మోటైనయ్! కాలే కడుపుతో పౌరోహిత్యానికి వెళ్లటం కన్పించదు.

పాపం శక్తి చాలకనో... ఓపిక లేకనో... ఎవరికి ఇష్టమైన తిండి వారు తినేసి మరీ పన్లోకి దిగటమనేది నేటి నాగరికతైంది.

మొత్తానికి వెకేట్ అయిన సీట్లో ఓ మూల చతికిలపడిన శాస్త్రి బిర్యానీ ఆర్డరిచ్చి... సర్వర్ తేగానే... లొట్టలేసుకుంటూ... ఆవురావురుమంటూ తిని... బొజ్జ నింపుకుని... 'బ్రేవ్'మని త్రేన్చి... బిల్లు చెల్లించి బైటికొచ్చి టూవీలర్ ఎక్కేడు శాస్త్రి!

'సిక్స్‌టీస్'లో హైదరాబాద్ వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా... హాయిగా వుండేది. వంటికి చెమట పట్టేదేకాదు!- రానురానూ... సిటీలో ఆకాశహర్మ్యాలు పెరగటంతో వాతావరణంలో అనూహ్యమైన మార్పు చేసుకోసాగింది. చివరికి... హైదరాబాద్ కూడా మరో విజయవాడలా తయారైంది. ఒకటే ఉక్కపోత... దిగకారే స్వేదం...

బండిమీద పోతుండబట్టి కాస్త గాలి వంటికి తగిలి హాయిగొలుపుతోంది శాస్త్రికి!

గుడ్డు శాకాహారం... అంటూ వచ్చే ప్రకటనలకు ఆకర్షితుడై బాయిల్డ్ ఎగ్స్... ఆమ్లెట్ తినటం ప్రారంభించిన శాస్త్రి... కాలక్రమేణ చికెన్ బిర్యానీకి అలవాటుపడ్డాడు.

వెధవది... ఎప్పుడూ ఆరగించే పప్పు ధప్పళమేగా... వంటికి కాస్తంత శక్తి రావాలన్నా... కావాలన్నా... అప్పుడప్పుడు ఇలాంటివి లాగించడం అవసరమన్పించింది!

శాకాహారంవంటికి మంచిదని డాక్టర్లు చెప్పే మాటలు శాస్త్రి చెవికెక్కలేదు.

మంత్రాలు చదివి చదివి బోలెడంత ఎనర్జీ వేస్టవుతూంటుంది. పోనీ... ప్రత్యామ్నాయంగ ఏ పండో ఫలమో... జూసో పొట్టలో పోయచ్చన్పించలేదు శాస్త్రికి.

నాగరికత వ్యామోహంలో... సిటీ కల్చర్‌కి బాగా అలవాటు పడ్డాడు శాస్త్రి! పాపం ఏం చేస్తాడు. పైగా రెండు చేతులా ఆర్జిస్తున్నాడాయె?!-

అవతల పెళ్ళి చేయించవలసిన సమయం దగ్గర పడుతూండటం మూలాన... వెహికిల్ స్పీడు పెంచాడు. చౌరాస్తా చేరుకునే సరికి గభాలున రెడ్‌సిగ్నల్ పడింది. వెంటనే బ్రేకు పడకపోవటంతో... తెల్లగీతలు దాటి ముందుకొచ్చిన శాస్త్రిని బీటు కానిస్టేబుల్ గమనించి నిబంధన వుల్లంఘించినందుకు చలాన్ బుక్ చేత్తో పట్టుకునొచ్చి గుడ్లురిమాడు.

'ఎంత?' కనుబొమలెగరేసాడు శాస్త్రి.

'వంద' చెలాన్ రాస్తూ చెప్పాడు పోలీస్.

'నాబొంద! అంత నా దగ్గరెక్కడేడ్చింది?- చూడూ!... నేనిప్పుడు మినిస్టర్‌గారి అబ్బాయి పెళ్ళి జరిపించడానికి అర్జంటుగా వెడుతున్నాను. నన్నిట్లా ఆపి లొల్లి చేస్తే... నువ్వు శంకరగిరి మాన్యాల్లో డ్యూటీ చేయటం ఖాయం! తర్వాత నీ ఇష్టం...'

ఆ మాటకి ఝడుసుకున్న పోలీసు ఎందుకైనా మంచిదనేసి శాస్త్రిని చెలాన్ చెయ్యకుండా వదిలాడు.

చావు తప్పి కన్ను లొట్టపోయిన విధంగా గ్రీన్ సిగ్నల్ పడటంతో బండి స్టార్ట్‌చేసి స్పీడు పెంచాడు.

మరికొంతదూరం పోయేసరికి మరో పోలీసు బృందం శాస్త్రి టూవీలర్ అడ్డుకుని ఆపింది!

చచ్చాన్రా దేవుడో!... మళ్ళీ ఇదేమిటీ? అనుకున్నవాడల్లా... 'బాబులూ!... అవతల ముహూర్తం మించిపోతోంది... నన్ను వెళ్ళనీయండి...' అంటూ బ్రతిమాలాడు.

లైసెన్స్ అడిగారు.

అది తన వెంటలేదు. కంగారుపడ్డాడు శాస్త్రి.

'పదిచోట్ల హడావుడిగా బండిమీద తిరగాల్సినోడిని కదా... తొందర్లో వెంట తెచ్చుకోవడం మరిచాను!... నా దురదృష్టం... మీరు తగిలారు!...'

'అదేం కుదర్దు. ఫైన్ కట్టాల్సిందే... బండి పక్కకు తీసిపెట్టండి స్వామీ...' యస్సై మాటల్లో విసుగు కన్పించింది.

ఇప్పుడేమిటి చేయటం? ఫైను చెల్లించాలంటే తన బొడ్లో ధనంలేదు. ఎలా?... అని గొణుక్కుని 'అయ్యా ఎస్సైగారూ! నావద్ద డబ్బుల్లేవు. ఫైనుకి ప్రత్యామ్నాయంగా... మీరు ఇల్లు కొంటే గృహప్రవేశం నాడో... సత్యనారాయణస్వామి వారి వ్రతం చేయించటానికో...

మీ అబ్బాయో అమ్మాయో వివాహం జరిపించేటందుకో... నన్ను పిలిపించండి! దమ్మిడీ ఖర్చు మిమ్మల్ని పెట్టనివ్వకుండా కార్యక్రమాన్ని ఓ.సీ.గా చేయించిపెడతాను మహానుభావా!... దయచేసి ఈసారికి నన్నొగ్గేయండి... నేను అర్జంటుగా వెళ్ళాలి! వెళ్ళటం ఆలస్యమైతే... అవతల వివాహం ఆగిపోతుంది...' బ్రతిమాలేడు శాస్త్రి.

ఎస్సై దేవాంతకుడు కదా?!- శాస్త్రిని మరోవిధంగా వాడుకోవచ్చనుకున్నాడో ఏమో!... సెల్‌నెంబర్ అడిగి తీసుకుని... టూవీలర్ నెంబర్ నోట్ చేసుకుని మరీ శాస్త్రిని విడిచిపెట్టాడు.

బతుకుజీవుడాని నిట్టూర్చి బండిని స్పీడుగా... మేరేజ్ హాలువేపు పోనిచ్చాడు.

అర్ధగంటలో ఫంక్షన్‌హాలు చేరుకున్నాడు. గోచీ సర్దుకుంటూ వడివడిగా లోనికి నడిచాడు.

ఇంతలో మంత్రిగారి బావమరిది ఎదురై... 'ఇప్పుడా తమరు రావటం?... అవతల వేళ మించిపోతోందని మా బావగారు చిందులు తొక్కుతున్నారు... రండి స్వామీ...' తొందరపెట్టాడు.

మంత్రిగారు శాస్త్రిని చూచి గుడ్లెర్రచేసి మీసం దువ్వుతూ "ఏంటి పంతులూ... ముహూర్తం మించిపోతుంటే...' అని వాక్యం పూర్తి చేయనివ్వకుండానే...

'అయ్యా! ముహూర్తం ఎక్కడికీ పరుగెట్టిపోదు. నాగురించి తక్కువగా అంచనా వెయ్యద్దు సార్! నన్ను చూస్తే చాలు ముహూర్తాలు గజగజ వణుకుతాయ్. కళ్లెర్రచేస్తే చాలు మలమలమాడిపోతయ్! మా తాతగారు దేవీ వుపాసకులు! మా వూరి పోలేరమ్మను ఆయన పిలిస్తే చాలు ఆయన కాల్చే చుట్ట వెలిగించటానికి నిప్పు కణికలను అరచేత్తో పట్టుకొచ్చి ఆయన ముందు నిలిచేది. అలాంటి పవర్‌ఫుల్ వంశంలో పుట్టినవాడిని నేను!- శాస్త్రాలనే తిరిగి రాయగల సత్తా నాకుంది!- ఇటు చూడండి... ఈ నా లావ్‌టావ్‌లో లేని ముహూర్తమంటూ లేదు. మీట నొక్కితే చాలు ముహూర్తం వెనుక ముహూర్తం ఇందులో కళ్ళ ఎదుట ప్రత్యక్షమౌతుంది! కనుక... మీరేం కంగారు పడకండి... నే పేచ్చేశాగా... అన్నీ నేను స్వయంగా చూచుకుంటాను. మంటపంమీద పన్లు నాకొదిలెసి మీరు వెళ్ళి అవతల మీ పన్లు చూచుకోండి...' గుక్కతిప్పుకోకుండా మాట్లాడాడు శాస్త్రి.

'ఇదిగో పంతులూ!... నువ్వు వశిష్ఠుడికి ఎక్కువ... విశ్వామిత్రుడికి తక్కువ!... నీ సంగతి నాకు తెలీదా?... వెళ్ళి పిల్లాడి చేత పిల్ల మెడలో మూడుముళ్ళు వేయించే సంగతి చూడవయ్యా... వెళ్ళు...' విసుక్కున్నాడు మంత్రివర్యులు.

'అదేమిటో ఖర్మ! నా పనికి అడుగడుగునా ఆటంకాలే వెధవది! ... దారిలో పోలీసోళ్ళు రెండుసార్లు నన్ను అటకాయించి ఇరుకున పెట్టారు. సరే ఎట్లాగో అట్లా వారి చెర వదిలించుకుని బైటపడిన నన్ను మీ పి.ఏ. గారు గేటువద్దనే ఎదురై ఆలస్యానికి అక్షింతలు వేశారు. ఇప్పుడు... మీరూ నన్నే వాయిస్తున్నారు- ఇదంతా చూస్తుంటే... అసలీ వివాహానికి ముహూర్త బలం గట్టిగా వున్నట్టు తోచటంలేదు. అసలెవరండీ ఈ పెళ్ళికి ముహూర్తం నిర్ణయం చేసింది?...'

శాస్త్రి మాటలు విన్న మంత్రిగారు ఆశ్చర్యపోతూ నోరెళ్ళబెట్టారు.

'ఇలాంటి దరిద్రపుగొట్టు ముహూర్తం నా సర్వీసులోనే నేనెన్నడూ చూడలేదు. అన్నీ అవరోధాలే... ఆటంకాలేనాయె. ఇన్నాళ్ళ నా సర్వీసులో ఇలాంటి దరిద్రపుగొట్టు ముహూర్తం చూడలేదంటే నమ్మండి?... మీకేమో శాస్త్రం తెలీదు. ఎవరు ఏం చెప్పినా నమ్మేస్తారు. తర్వాత ఏదైనా కిందా మీదా అయితే మా ముఖాన వుమ్మేస్తారు...! అసలిలాంటి విషఘడియల్లో పిల్లమెడలో పుస్తె కట్టించి మనం అక్షింతలు వేసినా... అవే శూలాలై వధూవరుల గుండెల్లో గుచ్చుకుంటయ్!... మీకు తెలుసోలేదో?...' తాషామరపా వాయించాడు శాస్త్రి.

మంత్రిగారు... బంధువర్గం నివ్వెరపోయి శిలాప్రతిమలే అయినారు శాస్త్రి మాటలు వింటూ.

శాస్త్రి మాటలు వింటూ అక్కడే వున్న పెండ్లికుమార్తె వైపువారు ఘొల్లుమన్నారు.

'అమృత ఘడియల్లో పెట్టవలసిన ముహూర్తం.... విషఘడియల్లో కుదిర్చాడు ఆడపిల్ల తరపు పురోహితుడు. డబ్బుకి కక్కుర్తిపడి పెట్టుడు ముహూర్తం పెట్టి వుంటాడన్పిస్తోంది...'

శాస్త్రి మాటలు అక్కడున్నవారిని అయోమయానికి గురి చేసినయ్!

'ఘనంగా వెయ్యి నూట పదహార్ల తాంబూలమిచ్చుకున్నానా సిద్ధాంతిగారికి' పిల్ల తండ్రి జవాబిచ్చాడు.

'ఆఁ... అలా చెప్పండి? అందుకే... అంటే మీరిచ్చింది బహుస్వల్ప మొత్తం కనుకనే అలాంటి వీరముష్టి ముహూర్తం నిర్ణయించాడూ...' దీర్ఘాలు తీసాడు శాస్త్రి.

'పరిస్థితి ఇందాకా వచ్చేక ఏమిటి చేయటం?...' మంత్రివర్యులు మండిపడ్డారు. అవాకులు చెవాకులు పేలద్దంటూ కళ్ళెర్రచేశాడు.

'అవాకులు కావు... విస్తరాకులూ కావు!- మరో గంటలో ఇంకో దివ్యమైన ముహూర్తం ఉంది...' అంటూ లాప్‌టాప్ ఓపెన్‌చేసి బటన్ నొక్కి పకపకానవ్వి ' నా మాట అబద్ధంకాదు... ఇదిగో చూడండీ ఇందులో ఎంత ప్రస్ఫుటంగా కన్పిస్తోందో...' గర్వంగా మాట్లాడేడు శాస్త్రి.

'ఇంకేం! అదే ముహూర్తం ఖాయం చేయండి. మీకు పదివేల నూట పదహార్ల తాంబూలం ఇచ్చుకుంటాను...' పిల్ల తండ్రి అనగానే 'ఆ తాంబూలం కేవలం ముహూర్త నిర్ణయానికేనండీ' వివాహం జరిపించటానికి పాతిక వేలకి తక్కువ పుచ్చుకోను... ఓ.కేనా?!...' ఓరగా చూస్తూ అన్నాడు శాస్త్రి.

అంతా ఓ.కే. అయింది! వివాహం సలక్షణంగా జరిగింది. శాస్త్రికి తాంబూలం అనుకున్నంతా ముట్టింది! శాస్త్రాన్ని సైతం తలకిందులు చేయగల సత్తా శాస్త్రిది!!

- సమాప్తం -